క్లుప్తంగా

పచ్చదనం పెంచుదాం



పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న హెచ్చెం, విద్యార్థులు

ఉయ్యాలవాడ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వర రావు సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దయమ్మనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో టేకు, నేరేడు, చింత, కానుగ, వంటి రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి నాటారు. మానవ మనుగడకు మొక్కలు ఆధారమని స్పష్టం చేశారు.

అక్రమ మద్యం ధ్వంసం



ధ్వంసం చేసేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం

బొమ్మలసత్రం: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని సోమవారం ధ్వంసం చేశారు. ఈసందర్భంగా సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి సూచనల మేరకు 149 లీటర్ల నాటుసారా, 36 లీటర్ల ఇతర రాష్ట్రాల మద్యం, 463 లీటర్లు అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని ధ్వంసం చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐతో పాటు ఎస్‌ఐ శంకర, సిబ్బందిపాల్గొన్నారు.

హంద్రీనీవా నీటితో చెరువులు నింపాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరు నింపి, సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపడితే రెండో కారు పంటలు వేసేందుకు వీలవుతుందన్నారు. వర్షా కాలంలో వచ్చే నీటి ద్వారానే పంటలు పండే పరిస్థితి ఉందని, డోన్ నియోజకవర్గంలోని చెరువులను హంద్రీనీవా నీటితో నింపాలన్నారు. ప్రస్తుతం పంటలు వేసుకునేందుకు చెరువులో నీరు లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా సాగు నీరు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు.

25 వేల క్యూసెక్కుల నీటి విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి రోజురోజుకు నీటి విడుదలను అధికారులు పెంచుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరుగేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కులకు నీటి సరఫరాను పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శ్రీశైలం జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 3,88,460 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతుండగా డ్యాంలో 883.50 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు వెల్లడించారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 882.50 అడుగుల నీటిమట్టం ఉండగా నీటి విడుదలను 23 వేల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 15 వేలు, కేసీఎస్కేప్ కాల్వకు 5 వేలు, జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వకు 5 వేల క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 350 క్యూసెక్కులు

తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,540 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 350 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నేడు కేసీ కాల్వకు నీటి సరఫరాను 2 వేల క్యూసెక్కులకు పెంచనున్నట్లు సుంకేసుల డ్యాం ఏఈ రాజు తెలిపారు.

కామేశ్వరీదేవికి సారె సమర్పణ

మహానంది: కామేశ్వరీదేవి అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా మహానందికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో చీర, సారె సమర్పించారు. మంగళవారం మహానంది ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు భవనాశి రమణయ్యల ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు, అమ్మవారికి పట్టుచీర, పిండివంటలు సమర్పించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సమక్షంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధానార్చకుడు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ, టీవీ రాజమాణిక్యశర్మ, రాజారత్తయ్యబాబు ప్రత్యేక పూజలు చేశారు.

సాగు కాలం.. జర జాగ్రత్త!

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న విత్తన కంపెనీలు
- ఏ మాత్రం ఆదమరిచినా నకిలీవి అంటగట్టే ప్రమాదం
- పంటసాగుకు గుర్తింపు కంపెనీల విత్తనాలనే ఎంపిక చేసుకోవాలి
- ఎరువుల, రసాయన మందులు కొనుగోలులోనూ జాగ్రతలు తీసుకోవాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన
- ఇప్పటికే పలు దుకాణాల్లో తనిఖీలు



గోస్పాడులో పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతు



విత్తనాల కేంద్రాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

గోస్పాడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పంట సాగు పనుల్లో తలమునకలయ్యారు. ఇప్పటికే కొంత మంది రైతులు పంటలు వేస్తుండగా మరికొందరు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో అవసరమైన విత్తనాలు, ఎరువు, పురుగు మందులను కొనుగోలు చేస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు కల్తీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, మందులు అంటగట్టుతుంటారు. ఈ నేపథ్యంలో కర్షకులు వాటి కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచిస్తున్నారు. జిల్లాలో 963 లైసెన్స్ పొందిన షాపులు ఉండగా అందులో పురుగు, ఎరువు మందుల దుకాణాలు 550 కాగా 413 విత్తనాల దుకాణాలు ఉన్నాయి. అయితే, అధికారులు జిల్లాలో పురుగు, ఎరువు మందులు, విత్తనాల దుకాణాలపై తనిఖీలు చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొనుగోలులో తేడా ఉన్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులకు రైతులు ఫిర్యాదు చేయాలి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. పలు కంపెనీల యాజమాన్యాలు డీలర్లకు రకరకాల ప్యాకేజీలు, విదేశీ ప్రయాణాలు ఆశ చూపడంతో డీలర్లు సదరు కంపెనీల విత్తనాలను కూడా విక్రయించే అవకాశం ఉంది. వాటిని గమనించి రైతులు కొనుగోలు చేయాలి. సీజన్ వచ్చిందంటే చాలు నంద్యాల ప్రాంతంలో నకిలీ, నాసిరకం విత్తనాలు దర్శనమిస్తుంటాయి. కొన్ని కంపెనీలు ఆకర్షణీయమైన ప్యాకింగ్, గుర్తింపు లేని లేబుళ్లతో నకిలీ విత్తనాలను మార్కెట్‌లో విక్రయిస్తుంటాయి. ఇటువంటి కంపెనీల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. విత్త నాల ప్యాకెట్లపై ప్రభుత్వ నిబంధనలు, వివరాలు సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

విత్తనాల ఎంపికలో ఇవి తప్పనిసరి

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు రసీదులపై నంబర్, విత్తనం రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా, తిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ఇచ్చిన ప్యాకెట్లు కొనుగోలు చేయరాదు.
- రసీదుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, విక్రయ్ దారుని గ్రామం పేరు, విక్రయదారుని సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలి. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారికి లేదా శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన రసీదును పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

పురుగు మందుల ఎంపికలో..

- పంటలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై చక్రకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విష పూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరిత మైతే ఆకు పచ్చ రంగు గుర్తులు ఉంటాయి.

కల్తీ మందులు ఇలా గుర్తించాలి...

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి.
- ఎరువులు ఇసుక రేణువుల రూపంలో, పొటాష్, సూపర్ పాస్పేట్ పొడి రూపంలో ఉంటాయి.
- 5 మిల్లీలీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించాలి
- యూరియా, అమ్మోనియా, క్లోరైడ్ ఎరువుల పరీక్షకు 10 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- యూరియా వంటి ఎరువును ఒక చెంచాను 5 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వస్తాయి. వాటిని కల్తీ ఎరువుగా గుర్తించాలి.

ఎరువుల కొనుగోలులో ..

- లైసెన్స్ దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒక వేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డుల్లో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారి సహాయంతో పరీక్షలకు పంపాలి. చిల్లులుపడి, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

అన్నా క్యాంటీన్ పనులు వేగవంతం చేయండి

నంద్యాల(సిటీ): పట్టణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక అన్నా క్యాంటీన్ వద్ద పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పేదలకు తక్కువ ధరకు ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తుందన్నారు.

1.66 కోట్లతో మహిళా మార్ట్ ఏర్పాటు

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఎస్సార్‌బీసీ, టిడ్కో గృహాల వద్ద రూ.1.66కోట్లతో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, టిడ్కో ఎస్‌ఈ (సూపర్‌వైజింగ్ ఇంజనీర్) రాజశేఖర్ అన్నారు. మంగళవారం వారు మార్ట్ ఏర్పాటు పనులకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. బుధవారం మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తారని వెల్లడించారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

నంద్యాల(న్యూటౌన్) దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గఫూర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీజీ కళాశాలలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నిరుద్యోగుల సమస్య పరిష్కారానికి బడ్జెట్‌లో కేటాయింపు చేయకుండా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దీంతో నిరుద్యోగ యువత చెడువ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. విభజన చట్టంలో హామీలు అమలుచేసి ఉంటే లక్షలాది ఉద్యోగాలు వచ్చి ఉండేవన్నారు. నేటియువత సమాజ మార్పునకు పనిచేయాలన్నారు. అనంతరం భవిష్యత్ కార్యాక్రమాల తీర్మానాలను చర్చించుకుని ఆమోదించారు. వలంటరీ వ్యవస్థను కొనసాగించాలని, అమ్మాయిలపై దాడులను అరికట్టాలని, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. వీటికోసం పోరాట బాట పడుతామని హెచ్చరించారు., కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామన్న, రాము, ఉపాధ్యక్షులు రమణ, సహాయ కార్యదర్శులు నాగేష్, శివ, కిరణ్, రాజు, మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు వందశాతం సబ్సిడీ

చాగలమర్రి: ఉపాధిహామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు వందశాతం సబ్సిడీ ఇస్తున్నట్లు ఏపీఓ నిర్మలాదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్ద బోధనం గ్రామంలో ఏపీఓ నిర్మలాదేవి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది ఉపాధిహామీ పథకం కింద 350 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు 149 ఎకరాల విస్తీర్ణంలో సాగుకు రైతులను గుర్తించామని తెలిపారు. 16 రకాల పండ్ల తోటలు సాగు చేసుకోవచ్చన్నారు. మండలంలో అసక్తి గల రైతులు తమ పొలానికి సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సదస్సులో సర్పంచ్ ముడియం శివమ్మ, వీఆర్‌ఓ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



పెద్ద బోధనం గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ

పిచ్చిమొక్కలు, గుంతలను తొలగించాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, గుంతలను తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గుంతలు, మురికినీరు, పిచ్చిమొక్కలను సీపీఐ బృందం పరిశీలించింది. జిల్లా కలెక్టర్ ఆవరణ అపరిశుభ్రతగా ఉండటం బాధాకరమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఖలీల్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

మండల మీట్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులందరూ పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

పెన్షన్ల పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం

నంద్యాల(అర్బన్): రేపటి నుంచి చేపట్టే ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ సౌభాగ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాపిరేవుల పీహెచ్‌సీ డాక్టర్ సంధ్యా చాపిరేవుల, పాండురంగాపురం, పుసులూరు, మిట్నాల గ్రామాల్లో, మండల ఏఓ ప్రసాదరావు పులిమద్ది, రాయమాల్పురం, పోలూరు గ్రామాల్లో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అయ్యలూరు-1, 2, మండల ఇంజినీర్ శివశంకర్ కొత్తపల్లె-1, 2, భీమవరం, చాబోలు గ్రామాల్లో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీనాయక్ పెద్దకొట్టాల, బిల్లలాపురం గ్రామాల్లో ఎంపీడీఓ సౌభాగ్యం కానాల-1, 2ను పర్యవేక్షించనున్నారన్నారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు వందశాతం పింఛన్ల పంపిణీ చేయాలన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు పింఛన్ల పంపిణీ సమయంలో పింఛన్ దారులందరూ ఇంటి వద్దనే ఉండేటట్లు ముందుగానే గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మధుకిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను కార్పొరేట్ విద్యా సంస్థలు గాలికి వదిలేస్తున్నాయన్నారు. క్రీడా మైదానాలు, మున్సిపల్ శానిటరీ సర్టిఫికెట్, పోలీసు ఎన్‌ఓసీ, ఫైర్ ఎన్‌ఓసీలు లేకుండా స్కూళ్లు నడుస్తున్నాయన్నారు. విద్యార్థుల నుంచి మాత్రమే నిర్వాహకులు వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆరోగ్య కార్యక్రమాలపై తనిఖీ

చాగలమర్రి: ముత్యాలపాడు-1 విలేజ్ క్లినిక్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం సభ్యులు సునీత, సుజాత మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివిధ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి నాజీనీన్, జిల్లా డేటా మేనేజర్, శివకుమార్, స్థానిక వైద్యాధికారిణి తస్లీమా సుల్తాన, ఆరోగ్య విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు ఉన్నారు.

ఆధ్యాత్మికం

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ : ఆషాడమాసం చివరి మంగళవారం కావడంతో మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామం అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంకుమ, సింధూరార్చనలు చేపట్టారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన ధనమోహనరెడ్డి, సాయిలక్ష్మి దంపతులు ప్రసాదాలు పంచిపెట్టారు.

వైభవంగా అష్టాదశ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాలికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవా నిర్వహించారు. అమ్మవారికి 108 వెండి పుష్పాలతో అష్టాదశ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.చివరలో అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, తదితర భక్తులు పాల్గొన్నారు.



రేపటి నుంచి మాతృభూమికి కళార్చన సాంస్కృతిక పోటీలు

నంద్యాల(వ్యవసాయం): మాతృభూమికి కళార్చన సాంస్కృతిక పోటీలు ఆగస్టు 1నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రవికృష్ణ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల కళారాధన, సాంస్కృతిక సంస్థ ఐఎంఏ, లయన్స్‌క్లబ్ సంయుక్త సహకారంతో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 అంశాల్లో మాతృభూమికి కళార్చన సాంస్కృతిక పోటీలు జరుగుతాయన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, కేటగిరీల్లో చిత్రపట విశ్లేషణ, లఘు చలన చిత్ర విశ్లేషణ, కవితారచన, లేఖారచన, కవితాగానం, పద్యపఠనం, సాంస్కృతిక శ్లోకాల పఠనం తదితరవి ఉంటాయన్నారు. ఆగస్టు 15వ తేదీ సాయంత్రం జరిగే వేడుకల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. దేశభక్తి భావాలను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించే ఈ పోటీల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు. వివరాలకు సెల్ : 9959307424కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ డిగ్రీ కళాశాలల అధినేత రామకృష్ణారెడ్డి, గురురాఘవేంద్ర విద్యాసంస్థల అధినేత దస్తగిరి, డాక్టర్ నాగమణి, వసుధారాణి, రోహిత్, మధుప్రీతి, సింధు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న కళారాధన సభ్యులు

తొలగించిన మొక్కజొన్న పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

చాగలమర్రి: మొక్క జొన్న పంట సరిగ్గా పెరగకపోవడంతో బ్రాహ్మణపల్లెలో రైతులు పంటను దున్నేశారు. ఈ విషయాన్ని పెరుగుదల లేని మొక్కజొన్న పంట శీర్షికన ‘సాక్షి’ మంగళవారం వెలుగులోకి తీసుకురావడంతో వ్యవసాయాధికారి రంగనేతాజీ స్పందించారు. గ్రామానికి వెళ్లి బాధిత రైతుల పంట పొలాలను పరిశీలించారు. కారణాలపై ఆరా తీశారు. నెల రోజుల క్రితం విత్తనం వేసి పదిరోజుల క్రితం నీటి తడి పెట్టినట్లు తెలిపారు. అయితే, బోరు నీటిలో లవణ శాతం అధికంగా ఉండటం వల్ల పంట ఎదుగుదల లేదని చెబుతున్నారని రైతులు ఏఓ దృష్టికి తీసుకెళ్లారు. బోరు నీటి నమూనాలను సేకరించి నంద్యాల ల్యాబ్‌కు పంపుతానని ఏఓ ఈ సందర్భంగా వెల్లడించారు. గ్రామంలో ఐదుగురు 30 ఎకరాల విస్తీర్ణంలో ఒకే కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలు వేశారు. పంట పెరగకపోవడానికి విత్తనమా లేక నీటిలో అధిక లవణాల కారణమా అన్నది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా పంట నష్టపోయిన తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ఈ సందర్భంగా ఏఓను కోరారు. 9



బ్రాహ్మణపల్లె గ్రామంలో దున్నేసిన మొక్కజొన్న పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ

● చెంతనీరున్నా తీరని దప్పిక



కుందూనది ఒడ్డున చెలమ నీటిని తోడుకుంటున్న గ్రామస్తులు

దొర్నిపాడు: పక్కన కుందూనది నిండుకుండలా ప్రవహిస్తున్నా క్రిష్టిపాడు గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఇంకా చెలమల నీటితోనే వారు దాహం తీర్చుకుంటున్నారు. అయితే, గత రెండు రోజులుగా వరదనీటితో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో చెలమలన్నీ నీట మునిగిపోయాయి. ఏం చేయాలో తెలియక గ్రామస్తులు నదిఒడ్డున కొత్త చలిమలు తీసుకొని నీళ్లను చెంబులతో బిందెలకు తోడుకొని ఇళ్లకు తీసుకెళ్తున్నారు. చెలమ నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉందని అధికారులు చెబుతున్నా గ్రామస్తులు మాత్రం ఆ నీటితోనే గొంతు తడుపుకుంటున్నారు.

● దారిపొడవునా గుంతలే

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ నుంచి దొర్నిపాడుకు వెళ్లే రహదారి పూర్తిగా ప్రమాదకరంగా మారింది. రెండు నుంచి మూడు అడుగుల గుంతలు ఏర్పడ్డాయి. 2016-17 సంవత్సరంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఉయ్యాలవాడ నుంచి 13.25 కిలోమీటర్ల దూరంలో వున్న దొర్నిపాడును కలుపుతూ ఈ రోడ్డు వేశారు. ఏడేళ్లు గడవడంతో తారంతా లేచిపోయి దాదాపు 6 కిలోమీటర్ల పొడువునా రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. రహదారిలో నిత్యం పై రెండు మండలాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణం సాగిస్తూ ఉంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచిన సందర్భాల్లో వేగంగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని రైతులు, పాదాచారులు కోరుతున్నారు.



దెబ్బతిన్న దొర్నిపాడు- ఉయ్యాలవాడ రహదారి

● కాల్వ ఇలా.. నీరు పారేదెలా

శిరివెళ్ల: త్వరలో పంట కాల్వలకు సాగు నీరు విడుదల కానున్నది. అయితే, పంట కాల్వల పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ ఏడాది ప్రభుత్వం ఉపాధి పనుల ప్రతిపాదనలు తగ్గించడంతో పంట కాల్వల పూడిక తీత జరగలేదు. దీంతో శిరివెళ్ల- యర్రగుంట్ల రెండం పంట కాల్వ పూడికతో నిండిపోయింది. నీరు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. కాల్వ కింద దాదాపు 543 ఎకరాల భూమి ఉంది. అసలే యర్రగుంట్లకు సాగునీరు చాలా ఆలస్యంగా అందుతుంది. కాల్వలో గడ్డి పేరుకుపోవడంతో నీరు ఎక్కడి కక్కడే నిలిచిపోయే ప్రమాదం ఉంది. త్వరగా పూడిక తీసి నీరు సక్రమంగా పారేలా చేయాలని వెంకటాపురం, యర్రగుంట్ల గ్రామాల రైతులు కోరుతున్నారు.



శిరివెళ్ల- యర్రగుంట్ల పంట కాల్వ